క్లుప్తంగా

ఆడారి ఆనంద్‌కుమార్ గెలవాలని పూజలు



పూజా సామగ్రిని తీసుకెళ్తున్న నాయకులు బద్రీనాథ్, భోగవల్లి నాగభూషణం

మల్కాపురం: విశాఖ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యేగా వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్ భారీ మెజారిటీతో విజయం సాధించాలని కోరుతూ శనివారం పార్టీ నాయకులు పూజలు చేశారు.

జేసీఎస్ కన్వీనర్ భోగవల్లి నాగభూషణం ఆధ్వర్యంలో మల్కాపురం సమీపాన గల వేంకటేశ్వర స్వామి ఆలయం, పెద్దింటమ్మతల్లి ఆలయాల్లో వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ రీజినల్ కో ఆర్డినేటర్ కలిదండి బద్రీనాథ్, పార్టీ 61వ వార్డు అధ్యక్షుడు జీవీఎస్ఎన్ రాజు(కేబుల్ వాసు), నాయకులు దాడి సత్యనారాయణ, మంగ తదితరులు ప్రత్యేక పూజలు చేసి ఎమ్మెల్యేగా ఆనంద్‌కుమార్ గెలవాలని, రాష్ట్రంలో మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాలని ప్రార్థించారు.

బాణసంచా నిల్వ ఉంచిన ఇళ్లపై దాడులు

- రూ.70 వేల సరకు స్వాధీనం

మల్కాపురం: ఎన్నికల ఫలితాల అనంతరం బాణసంచా కాల్చడంపై నిషేధం ఉన్న నేపథ్యంలో నగర పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శనివారం మల్కాపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో దాడులు నిర్వహించారు. సుమారు రూ.70 వేల విలువ గల బాణసంచా సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. గతేడాది దీపావళి నాడు స్థానిక వాకర్స్ పార్కు వద్ద స్టాళ్లు పెట్టుకున్న బాణసంచా సామగ్రి విక్రయించిన వారి ఇళ్లపై పోలీసులు దాడులు చేశారు. నెహ్రూనగర్‌కు చెందిన ఇద్దరు వ్యక్తుల ఇళ్లలో, హనుమాన్ సంజీవ్ కాలనీ ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి ఇంట్లో సామగ్రి నిలువ ఉంచడాన్ని పోలీసులు గుర్తించారు. దానిని స్వాధీనం చేసుకుని, ఎటువంటి అనుమతులు లేకుండా ఇంట్లో సామగ్రి ఉంచిన ముగ్గురు వ్యక్తులను పోలీసుల అదుపులోకి తీసుకున్నారు. వీరిపై కేసులు నమోదు చేస్తామని తెలిపారు. ఎస్ఐ దేవుడమ్మ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

క్రీడా రత్నాలు

- వివిధ క్రీడల్లో రాణిస్తున్న పారిశ్రామిక ప్రాంత క్రీడాకారులు
- జాతీయ, అంతర్జాతీయ పతకాలు

మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతంలోని పలువురు క్రీడాకారులు వివిధ క్రీడల్లో సత్తా చాటుతున్నారు. జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో పతకాలు సాధించి ఈ ప్రాంతానికి వన్నెతెచ్చారు. సత్తా చాటిన వారిలో 12 ఏళ్ల బాలిక నుంచి 69 ఏళ్ల వెటరన్ క్రీడాకారుడు ఉండడం విశేషం.

రేష్మాకు బాక్సింగ్‌లో పతకాల పంట

జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం గొల్లవీధి ప్రాంతానికి చెందిన వాకాడ రేష్మా స్థానిక ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి చదువుతుంది. రేష్మాకు బాక్సింగ్ అంటే మక్కువ. దీంతో తల్లిదండ్రుల ప్రోత్సాహంతో బాక్సింగ్‌లో శిక్షణ తీసుకుని జిల్లా ,రాష్ట్ర ,జాతీయ స్థాయి మహిళా విభాగ బాక్సింగ్ పోటీల్లో బంగారు పతకాలు సాధించింది. ఇటీవల పూణేలో జరిగి జాతీయ మహిళా విభాగ బాక్సింగ్ పోటీల్లో బంగారు పతకం తెచ్చింది. ఇంత వరకు రేష్మాయాదవ్ ఐదు గోల్డు మెడల్స్, నాలుగు సిల్వర్ మెడల్స్, ఆరు బ్రాంజ్ మెడల్స్ గెలుచుకుంది.

రేస్ వాకింగ్‌లో అన్సర్‌వలి ..

శ్రీహరిపురం ప్రాంతానికి చెందిన అన్సర్ వలి శ్రీహరిపురం సబ్‌స్టేషన్‌లో ఏఎల్ఎం ఉద్యోగి. పాఠశాల దశ నుంచి కబడ్డీ, రన్నింగ్ ఇతర పోటీల్లో పాల్గొంటూ ప్రతిభ చూపేవాడు. ఎన్టీపీసీ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి రన్నింగ్, డిస్కస్ త్రో పోటీల్లో రెండో స్థానంలో నిలిచాడు. జిల్లా స్థాయిలో జరిగిన సాఫ్ట్ బాల్ పోటీల్లో విన్నర్‌గా నిలిచాడు. ఇటీవల శ్రీలంకలో జరిగిన ఇంటర్నేషనల్ మాస్టర్ అథ్లెటిక్స్ 5 కేఎం రేస్ వాకింగ్ పోటీలో బంగారు పతకం సాధించాడు.

60 ఏళ్లు దాటినా.. ఆగని పరుగు

60వ వార్డు ఇందిరాకాలనీకి చెందిన ఆకుల కనకరాజుకు 69 ఏళ్లు. ఈయన విశాఖ సెంట్రల్ జైల్‌లో పనిచేసి రిటైరయ్యారు. తన 13వ ఏట నుంచే వివిధ పోటీల్లో కనకరాజు ప్రతిభ చూపేవాడు.బాక్సింగ్, ఫుట్‌బాల్, ఖోఖో, కబడ్డీ, హాకీలో మంచి ప్రావీణ్యం ఉంది. 1996లో నేషనల్ స్థాయి 100, 200, 300 మీటర్ల పరుగు పందెంలో బంగారు పతకాలు సాధించాడు. అలాగే 2016లో నిర్వహించిన ఆసియా అథ్లెటిక్స్‌లో 100, 200, 400 మీటర్ల పరుగు పందెంలో గోల్డు మెడల్స్ కైవసం చేసుకున్నారు. ఇటీవల సికింద్రాబాద్‌లో జరిగిన నేషనల్ స్థాయి అథ్లెటిక్స్ 400 మీటర్ల పరుగు పందెంలో గోల్డ్ మెడల్ సాధించాడు.

బాక్సింగ్‌లో రోషి ప్రతిభ

శ్రీహరిపురం ప్రాంతానికి చెందిన 12 ఏళ్ల రోషి జూనియర్ స్థాయి బాక్సింగ్‌లో ప్రతిభ వంతురాలు. రఘు మెమోరియల్ బాక్సింగ్ క్లబ్ నుంచి సబ్ జూనియర్ జిల్లా స్థాయి బాక్సింగ్ పోటీ (2021)ల్లో సిల్వర్ మెడల్ సాధించింది. నగరంలో 2022లో జరిగిన జిల్లా స్థాయి సబ్ జూనియర్ బాక్సింగ్ పోటీల్లో సిల్వర్ మెడల్,ఇటీవల స్వర్ణ భారతి స్టేడియంలో జరిగిన జిల్లా స్థాయి సబ్ జూనియర్ బాక్సింగ్ పోటీల్లో బంగారు పతకం సాధించింది.



5 కేఎం రేస్ వాకింగ్‌లో గోల్డ్ మెడల్ సాధించిన అన్సర్‌వలి



పరుగు పందెంలో బంగారు పతకాలు సాధించిన కనకరాజు



ఇంటర్నేషనల్ బాక్సింగ్‌లో గోల్డ్ మెడల్ సాధించిన రేష్మా



జిల్లా స్థాయి బాక్సింగ్‌లో బంగారు పతకం సాధించిన రోషి

సర్వీస్ రోడ్డులో లారీల తొలగింపు

సాక్షి ఎఫెక్ట్..

మల్కాపురం: స్థానిక ఐవోసీ టెర్మినల్ ప్లాంట్ సర్వీస్ రోడ్డులో ఆయిల్ ట్యాంకర్లను డ్రైవర్లు రాంగ్ పార్కింగ్ చేస్తున్నారు. దీని వల్ల ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తున్న వాహన చోదకులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యపై ఈ నెల 23న 'విశాల మార్గం.. ఇరుకుమయం' అనే శీర్షికన 'సాక్షి'లో ప్రచురించిన కథనానికి ట్రాఫిక్ అధికారులు స్పందించారు. మల్కాపురం ట్రాఫిక్ సీఐ షణ్ముకరావు, ఎస్ఐ జి.అప్పారావులు శనివారం సిబ్బందితో కలిసి ఐవోసీ ప్లాంట్ మార్గం వద్దకు వెళ్లి సర్వీస్ రోడ్డుకు ఇరువైపులా నిలిపి ఉంచిన లారీలను తొలగించే చర్యలు చేపట్టారు. ఐవోసీ టెర్మినల్ అధికారులతో సీఐ, ఎస్ఐలు మాట్లాడి కంపెనీ కేటాయించిన పార్కింగ్ స్థలంలోనే లారీలను పార్క్‌చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆయిల్ ట్యాంకర్లను సర్వీస్ రోడ్డులో అనధికారకంగా పార్క్‌చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. మల్కాపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని సర్వీస్ రోడ్లలో ఎక్కడైనా లారీలను రాంగ్ పార్కింగ్ చేస్తే కఠిన చర్యలతోపాటు జరిమానాలు తప్పవని డ్రైవర్లను హెచ్చరించారు. సమస్య పరిష్కారమవడంతో ట్రాఫిక్ పోలీసులకు వాహన చోదకులు, పాదచారులు కృతజ్ఞతలు తెలియజేశారు.



ఐవోసీ ప్లాంట్ సర్వీస్ రోడ్డులో పార్క్‌చేసిన ఆయిల్ ట్యాంకర్లను తొలగించిన ట్రాఫిక్ అధికారులు

శిక్షణ శిబిరాలతో చిన్నారులకు మేలు



మాట్లాడుతున్న రచయిత సుంకర చలపతిరావు



యోగాలో శిక్షణ పొందుతున్న చిన్నారులు

మల్కాపురం: వేసవి శిక్షణ శిబిరాల ద్వారా చిన్నారుల్లో కొత్త ఆలోచనలు వెల్లివిరుస్తాయని రచయిత, కవి, సీనియర్ జర్నలిస్ట్ సుంకర చలపతిరావు అన్నారు. మల్కాపురం శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో శనివారం చిన్నారులకు యోగాలో శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అతిథిగా ఆయన మాట్లాడుతూ చిన్నారులు వేసవి సెలవులను వృథా చేయరాదని, విజ్ఞాన శిబిరాల వద్దకు వెళ్లి తమకు నచ్చిన అంశంలో శిక్షణ పొందాలని సూచించారు. పుస్తకాలు చదవడం వల్ల విజ్ఞానం పెరిగి చైతన్యం వస్తుందన్నారు. శిక్షణ శిబిరంలో పాల్గొన్న చిన్నారులను చలపతిరావు అభినందించారు. కార్యక్రమంలో రచయిత, జర్నలిస్ట్ నరసింహం, రచయిత సత్తిరాజు, గ్రంథాలయాధికారి అజయ్ తదితరులు పాల్గొన్నారు.

సెల్‌టవర్ నిర్మాణం ఆపాలని వినతి

విశాఖ విద్య: జనావాసాలకు సమీపంలో సెల్ టవర్ నిర్మాణం నిలిపివేయాలని కాలనీ వాసులంతా డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్‌కు విన్నవించారు. ఈ మేరకు పరదేశిపాలెం గ్రామస్తులు శనివారం డిప్యూటీ మేయర్ శ్రీధర్‌ను కలసి వినతి పత్రం అందజేశారు. సెల్ టవర్ నిర్మాణం వల్ల ప్రజలకు ఆరోగ్యపరమైన సమస్యలు తలెత్తుతాయని, దీన్ని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నా, నిర్మాణదారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై సానుకూలంగా స్పందించిన డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సెల్ టవర్ నిర్మాణ పనుల విషయమై వివరాలు తెలుసుకుంటామని, ప్రజలకు ఇబ్బందికరంగా ఉంటే నిర్మాణం నిలిపివేసేలా తగిన చర్యలు తీసుకుంటామన్నారు.



శ్రీధర్‌కు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

పరిశుభ్రత పాటిస్తే ఆరోగ్యం

సింథియా: రుతుక్రమ సమయంలో మహిళలు పరిశుభ్రత పాటించడం ద్వారా అనేక అనారోగ్య సమస్యలకు దూరంగా ఉండవచ్చునని ఐసీడీఎస్ మల్కాపురం సెక్టార్ సూపర్‌వైజర్ వరలక్ష్మి అన్నారు. జీవీఎంసీ 63వ వార్డు క్రాంతినగర్ అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం ఐసీడీఎస్ మాసిక మహోత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల్లో వచ్చే రుతుక్రమం గురించి ఉన్న అపోహలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పౌష్టికాహారం ప్రాముఖ్యత గురించి వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు దాక్షాయిని, బల్ల భారతి, ఎస్.యశోద, విద్యులత, ఆశ కార్యకర్తలు సుందరమణి, సృజన, ఎస్‌ఈవో ప్రోగ్రాం కో ఆర్డినేటర్ జ్యోతిశ్రీ, పాల్గొన్నారు.



మహిళలకు అవగాహన కలిగిస్తున్న సూపర్‌వైజర్ వరలక్ష్మి

పారిశుధ్య నిర్వహణ భేష్



పూడిక తీయడంతో శుభ్రంగా ఉన్న ప్రధాన కాలువ

సింథియా: పారిశ్రామిక ప్రాంతంలోని కాలువల నిర్వహణపై పారిశుధ్య అధికారులు దృష్టిసారించారు. పరిశుభ్రతతో పాటు పారిశుధ్య కార్మికులు ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరిస్తున్న తీరు బాగుందని ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.సమస్య చెప్పిన వెంటనే అధికారులు స్పందించి చెత్త తీయించడంతో పాటు కాలువలు శుభ్రం చేయడంపై అభినందిస్తున్నారు.

ఎర్నిమాంబ సన్నిధిలో అన్నదానం

కంచరపాలెం: కాన్వెంట్ కూడలిలో వెలసిన ఎర్నిమాంబ వార్షికోత్సవాల్లో భాగంగా ఆలయ ఈవో డీవీఎస్ సురేష్‌బాబా నేతృత్వంలో శనివారం అన్న సమారాధన నిర్వహించారు. కార్యక్రమాన్ని ముఖ్య అతిథి దేవదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ ఎస్.సుజాత ప్రారంభించారు. ఆలయ అర్చకుడు శ్రీకాంత్‌శర్మ, పూజారమ్మ వాసుపల్లి విజయమ్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు.

పోలీసుల స్పెషల్ డ్రైవ్

గోపాలపట్నం: గోపాలపట్నం,ఎన్ఏడీ ప్రాంతాల్లో గోపాలపట్నం, ఎయిర్‌పోర్టు పోలీసులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. విశాఖ పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు శనివారం డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టారు. కౌంటింగ్ సమయం దగ్గర పడుతున్న నేపథ్యంలో పోలీసులు తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నారు. గోపాలపట్నం స్టేషన్ పరిధిలో సీఐ సురేష్ పర్యవేక్షణలో అడవివరం, గోశాల జంక్షన్, ఎల్‌జీపాలిమర్స్ జంక్షన్, గోపాలపట్నం శ్మశాన వాటిక జంక్షన్ ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారు. ఎయిర్‌పోర్టు పోలీస్ స్టేషన్ పరిధిలో సీఐ చక్రధరరావు పర్యవేక్షణలో ఎన్ఏడీ జంక్షన్, పంజాబ్‌హోటల్ జంక్షన్లలో తనిఖీలు చేపట్టారు.



ఎన్ఏడీలో డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ నిర్వహిస్తున్న ఎయిర్‌పోర్ట్ సీఐ చక్రధరరావు, ఎస్ఐ రామకృష్ణ

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

గోపాలపట్నం: ఎన్ఏడీ జంక్షన్ ఫ్లైఓవర్ బ్రిడ్జి దిగువన ఆల్ఫా హోటల్ ఎదురుగా గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. ఎయిర్‌పోర్టు పోలీసులు తెలిపిన వివరాలు.. ఫ్లైఓవర్ బ్రిడ్జి దిగువున ప్లాస్టిక్ వస్తువులు సేకరించి అమ్ముకునే వ్యక్తి మృతి చెందినట్టు వచ్చిన సమాచారం మేరకు ఎయిర్‌పోర్టు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అయితే మృతి చెందిన వ్యక్తి ఏ ప్రాంతానికి చెందిన వాడు వంటి వివరాలు తెలియరాలేదు. మృత దేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. మృతుడి మొహం, శరీరంపై గాయాలు ఉండడంతో ఎవరైనా కొట్టి చంపారా, లేక గొడవ జరగడంతో కొట్లాటలో మృతి చెందాడా అన్న కోణంలో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతుడిని గుర్తు పట్టిన వారు సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు.



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం